ప్రశాంతంగా పోలింగ్

- ఉదయం నుంచి బారులు తీరిన ఓటర్లు
- ఓటు వేసేందుకు తరలివచ్చిన యువత
- పకడ్బందీగా పోలీసుల బందోబస్తు
- పలుచోట్ల ఈవీఎంల మొరాయింపు
- ముధోల్ నియోజకవర్గంలో 80.54 శాతం పోలింగ్



భైంసారూరల్: దేగాం గ్రామంలో ఓటు వేసేందుకు బారులు తీరిన గ్రామస్తులు

ముధోల్: మండల వ్యాప్తంగా 84శాతం పోలింగ్, ముధోల్ నియోజకవర్గవ్యాప్తంగా 80.54 పోలింగ్ శాతం నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కోమల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రువ్వి గ్రామంలో బీఎస్పీ అభ్యర్థి సర్దార్ వినోద్‌కుమార్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయా కేంద్రాల్లో దివ్యాంగులు, వృద్ధుల కోసం ఏర్పాట్లు చేశారు. కొన్ని గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించాయి. ముధోల్ సీఐ వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

లోకేశ్వరం మండలంలో 83.9 శాతం పోలింగ్

లోకేశ్వరం: మండలంలోని 38 పోలింగ్ కేంద్రాల్లో 83.9 శాతం పోలింగ్ నమోదైనట్లు ఏఈఆర్వో తెలిపారు. ధర్మోర, లోకేశ్వరం గ్రామాల్లో ఈవీఎంలు మొరయించడంతో గంట పాటు పోలింగ్ ఆలస్యమైంది. లోకేశ్వరం, పంచగుడి గ్రామాల్లో సాయంత్రం 5 గంటల తర్వాతా ఓటర్లు క్యూలో నిలబడి ఓటు వేశారు. మండలంలో 28,772 మంది ఓటర్లు ఉండగా 24,145 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎస్సై సాయికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కుంటాల మండలంలో 84.4 శాతం..

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో 84.4 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సహాయ అధికారి ఎజాజ్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. లింబా(కే)లో కొద్దిసేపు ఈవీఎం మొరాయించగా సిబ్బంది సరిచేశారు. మండలంలోని ఓలా గ్రామంలో పోలింగ్ కేంద్రానికి వచ్చిన వారికి ఐదు గంటలు దాటినా ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. బీఆర్‌ఎస్ నాయకురాలు రమాదేవి అందాకూర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎస్సై హన్మాండ్లు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



భైంసాలోని కేజీబీవీ పోలింగ్ కేంద్రంలో పరిశీలిస్తున్న ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్



లోకేశ్వరంలో వృద్ధురాలిని తీసుకొస్తున్న సిబ్బంది

భైంసారూరల్/భైంసాటౌన్: పట్టణంలో గురువారం పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా, ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం కేంద్రాల వద్ద వీల్‌చైర్లు అందుబాటులో ఉంచారు. సాయంత్రం ఐదు గంటల తరువాత ఓటర్లను కేంద్రాల్లోకి అనుమతించలేదు. ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ ఎప్పటికప్పుడు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళి పరిశీలించారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు రవిరంజన్ కుమార్ విక్రమ్ మదీనా కాలనీలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు. కాగా, కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల పేర్లు జాబితాలో లేకపోవడంతోపాటు పేర్లు తప్పుగా ఉండడంతో వెనుదిరిగారు. కుంట ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో ఈవీఎం కొద్దిసేపు మొరాయించింది

భైంసా మండలంలోని వానల్‌పాడ్, దేగాం, సుంక్లి, తిమ్మాపూర్, ఇలేగాం, పేండ్‌పెల్లి, మిర్జాపూర్, కోతల్‌గాం, మహాగాం, మాటేగాం, హజ్గుల్ తదితర గ్రామాల్లో ఓటర్లు బారులు తీరారు.

తానూరు: మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కొందరికీ ఓటరు చీటీలు అందక ఇబ్బంది పడ్డారు. ఝరి(బి)లో రాత్రి ఏడు గంటల వరకు పోలింగ్ జరిగింది. కొన్ని కేంద్రాల్లో టెంట్లు లేక ఓటర్లు చెట్ల కింద తలదాచుకున్నారు.

కుభీర్: మండలంలోని బెల్గాంలో పోలింగ్ కేంద్రంలో ఉదయం ఈవీఎంలు కొంతసేపు మొరాయించాయి. కుభీర్‌లోని ఉర్దూ మీడియం పాఠశాలలోని పోలింగ్ బూత్‌లో ఒక పోలింగ్ అధికారి 'వృద్ధులకు పైన దానికి ఓటేయండి'అని చెప్పడంతో బీజేపీ నాయకులు ఆందోళనకు దిగారు. దీంతో సదరు అధికారిని విధుల నుంచి పక్కన పెట్టారు. క్యూలైన్‌లో ఉన్న వారికే సాయంత్రం ఐదు గంటల తర్వాత ఓటేసే అవకాశం కల్పించారు.



ముధోల్‌లో క్యూలైన్‌లో ఓటర్లు



కుంటాల: ఓలాలో బారులు తీరిన ఓటర్లు



తానూరులో బారులు తీరిన ఓటర్లు



కుభీర్: నిగ్వాలో క్యూలైన్‌లో ఓటర్లు

ఆలయంలో మంత్రి పూజలు



బాబా ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గండిరమణ ఆలయంలో నిర్మల్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి , మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ చైర్మన్ లక్కడి జగన్మోహన్‌రెడ్డి వారికి స్వాగతం పలికారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమకు విజయం కలగాలని దేవున్ని ప్రార్థించారు.

పలు కేంద్రాలు సందర్శించిన మంత్రి

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని పలు పోలింగ్ కేంద్రాలను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సందర్శించారు. శాస్త్రినగర్, రాంనగర్, మంజులాపూర్, బుధవార్‌పేట్, గాంధీనగర్, శాంతినగర్ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా నిర్మల్ నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని మంత్రి వెల్లడించారు.

ఖానాపూర్‌లో మొరాయించిన ఈవీఎంలు



తిమ్మాపూర్‌లో మొరాయించిన ఈవీఎంను సరి చేస్తున్న సిబ్బంది

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్‌కాలనీలో తిమ్మాపూర్ ప్రభుత్వ పాఠశాలలో 239 పోలింగ్ బూత్‌లోని ఈవీఎం పోలింగ్ ప్రారంభానికి ముందే మొరాయించింది. వీవీప్యాట్ సమస్యతో మొరాయించినట్లు పోలింగ్ కేంద్రం అధికారులు తెలిపారు. అనంతరం మరోసారి అదే విధంగా మొరాయించింది. దీంతో సుమారు 2 గంటల పాటు ఓటర్లు పోలింగ్ కేంద్రం వద్ద వేచిఉన్నారు. ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని 235 పోలింగ్ బూత్‌లో సుమారు గంటకు పైగా ఈవీఎం మొరాయించింది. బాదనకుర్తి గ్రామంలోని 251 పోలింగ్‌బూత్‌లో ఈవీఎం గంటపాటు మొరాయించింది. మండలంలోని ఎర్వచింతల్ గ్రామంలోని పోలింగ్‌బూత్‌లో సైతం వీవీప్యాట్ సమస్యతో ఈవీఎం సుమారు రెండు గంటలపాటు మోరాయించింది. దీంతో సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని వాటిని సరిచేశారు. దీంతో పోలింగ్ ప్రారంభమైంది.

నిర్మల్‌లో 76.02 శాతం..

నిర్మల్‌రూరల్: నిర్మల్ నియోజకవర్గంలో 76.02 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. నిర్మల్ మండలంలోని ఎల్లపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఇంద్రకరణ్‌రెడ్డి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వెంగ్వపేట్‌లోని 173వ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో అధికారులు మరో మిషన్ తీసుకొచ్చి పోలింగ్ నిర్వహించారు. దీంతో అక్కడా రాత్రి ఏడు గంటల వరకు పోలింగ్ సాగింది. మేడిపల్లి ,రత్నాపూర్‌కాండ్లీ, కొండాపూర్, కౌట్ల(కే), చిట్యాల గ్రామాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లు ఎక్కువగా ఉండడంతో గంటల తరబడి క్యూ లైన్‌లో నిల్చొని ఓటు వేశారు.

లక్ష్మణచాంద మండలంలో 83.27 శాతం

లక్ష్మణచాంద: మండలంలోని 23 గ్రామాల్లో 23,558 మంది ఓటర్లు ఉండగా 19,617 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. పురుషులు 8,416, మహిళలు 11,201, ఓటుహక్కును వినియోగించుకోగా మండలంలో 83.27 శాతం పోలింగ్ నమోదైనట్లు పేర్కొన్నారు. కనకాపూర్‌లో 90.36శాతం, తిర్పెల్లిలో 88.95 శాతం, పొట్టపల్లి(కే)లో 88.80 శాతం , బోరిగాంలో 86.16 శాతం, నర్సాపూర్‌లో 83.44శాతం, న్యూకంజర్‌లో 87.77శాతం, చామన్‌పల్లిలో 96.83 శాతం, మల్లాపూర్‌లో 85.02శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు.



నిర్మల్‌రూరల్: భాగ్యనగర్‌లో క్యూలో ఓటర్లు

సోన్: మండలంలోని 26 పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా ఎన్నికలు జరిగినట్లు అధికారులు తెలిపారు. దివ్యాంగులు, వృద్ధులకు ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేసినట్లు వారు పేర్కొన్నారు.

నర్సాపూర్(జి)లో 80.72 శాతం పోలింగ్..

నర్సాపూర్(జి): మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నిర్మల్ నియోజకవర్గ పరిధిలోని ఐదు గ్రామాల్లో 10,624 ఓటర్లు ఉండగా 8,538 మంది ఓటు వేసుకున్నారు. ముధోల్ నియోజకవర్గ పరిధిలోని ఎనిమిది గ్రామాల్లో 8,998 మంది ఓటర్లు ఉండగా 7,209 మంది ఓటుహక్కును సద్వినియోగం చేసుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. నిర్మల్ నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో 81.25శాతం.. ముధోల్ నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో 80.11శాతం పోలింగ్ నమోదైనట్లు పేర్కొన్నారు. తిమ్మాపూర్(జి)లో ఈవీఎం గంటసేపు మొరాయించడంతో 8 గంటలకు పోలింగ్ ప్రారంభించారు. మండల కేంద్రంలోని 301,302వ పోలింగ్ కేంద్రాలను ఇంద్రకరణ్‌రెడ్డి పరిశీలించారు. గులాబీ కండువాతో బూత్‌లోకి వెళ్లడంతో బీజేపీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు.



లక్ష్మణచాందలో బారులు తీరిన ఓటర్లు



నర్సాపూర్(జి): తిమ్మాపూర్(జి)లో తొలిసారి ఓటు వేసిన యువకులు

సారంగాపూర్‌లో పరిశీలించిన ఎస్పీ

సారంగాపూర్: మండలంలోని 54 పోలింగ్ కేంద్రాల పరిధిలో 36,684 మంది ఓటర్లు ఉన్నారు. బోరిగాం గ్రామంలో 41వ పోలింగ్ బూత్‌లో ఈవీఎం గంటపాటు మొరాయించడంతో ఓటర్లు వేచి చూశారు. కొత్త ఈవీఎంను తీసుకొచ్చి 141 ఓట్లు పోలైన పాత ఈవీఎంను సీల్ చేశారు. బీఆర్‌ఎస్, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణలు చోటు చేసుకోగా నిర్మల్‌రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి వారిని చెదరగొట్టారు. సారంగపూర్ పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ సీహెచ్. ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. కేంద్రాల సమీపంలో గుంపులుగా ఉంచొద్దని సిబ్బందిని ఆదేశించారు.



సోన్: న్యూబొప్పారంలో జరుగుతున్న పోలింగ్



సారంగపూర్‌లో ఎస్పీ ప్రవీణ్‌కుమార్ పరిశీలన

మోడల్ పోలింగ్ కేంద్రం



ఆకట్టుకున్న పోలింగ్ కేంద్రం

భైంసారూరల్: మండలంలోని మాటేగాం గ్రామంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం ఆకట్టుకుంది. ఓటర్లకు స్వాగతం పలికేందుకు 97వ పోలింగ్ బూత్‌ను అందంగా సిబ్బంది తీర్చిదిద్దారు.

ఖానాపూర్‌లో 77.46 శాతం



ఖానాపూర్‌లో కేంద్రం ఆవరణలో ఓటర్లు

ఖానాపూర్: ఖానాపూర్ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 77.46 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

ఖానాపూర్ మండలంలో..

పట్టణంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో 50 పోలింగ్ కేంద్రాల్లో 40,281ఓట్లకు గాను 30423 ఓట్లు పోలైనట్లు మండల రిటర్నింగ్ అధికారి పరిమల్ భౌమిక్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో చిన్న చిన్న సమస్యలు తలెత్తినా ప్రిసైడింగ్ అధికారులు సరిచేశారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాయకులు కేంద్రంలో ఉండి ఓటర్లను ప్రలోభ పెడుతున్నారని ఘర్షణ తలెత్తింది. ఎర్వచింతల్‌లో అధికార పార్టీ సర్పంచ్ గోపాల్‌ను పోలింగ్ ఏజెంట్‌గా నియమించడంపై కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఆందోళనకు దిగారు. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. ఐదు గంటల తర్వాత కేంద్రాల్లో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం కల్పించారు.

ఖానాపూర్ మున్సిపల్ కార్యాలయం, మండలంలోని తర్లపాడ్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఆదర్శ పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

దస్తురాబాద్ లో 83.9శాతం పోలింగ్

దస్తురాబాద్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన 20 పోలింగ్ కేంద్రాల్లో 83.09 పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల పర్యవేక్షణ అధికారులు తెలిపారు. మండలంలో 12,705 మంది ఓటర్లు ఉండగా 10,333 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని పెర్కపల్లెలో 145వ, మున్యాలలో 150వ, రేవోజీపేట 155వ పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించాయి. దీంతో అధికారులు సరిచేయడంతో అరగంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలైనా మున్యాల, మున్యాలతండాలో బీఎస్‌ఎఫ్ జవాన్లు, స్థానిక పోలీసులతో కలిసి బందోబస్తు చేపట్టినట్లు ఎస్సై ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.



కడెంలో బారులు తీరిన ఓటర్లు

కడెం మండలంలో 79.70 శాతం పోలింగ్..

కడెం: మండలంలోని 36 పోలింగ్ కేంద్రాల్లో 79.70 శాతం పోలింగ్ నమోదైనట్లు ఏఈఆర్వో రాజేశ్వరి తెలిపారు. మండలంలో మొత్తం 28,276 మంది ఓటర్లు ఉండగా.. 22,537 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని గండిగోపాల్‌పూర్ పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా 91.04 శాతం పోలింగ్, పెద్దబెల్లాల్ 159వ పోలింగ్ కేంద్రంలో అత్యల్పంగా 67.36 శాతం నమోదైంది. మండల కేంద్రంలోని 167వ పోలింగ్ కేంద్రంలో సాయంత్రం 6:30 గంటల వరకు పోలింగ్ జరిగింది. కేంద్రాలను బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీల అభ్యర్థులు పరిశీలించారు.

వసతుల్లేక ఓటర్ల అవస్థలు

భైంసాటౌన్: పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో తాగునీటితోపాటు నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయకపోవడంతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు. కాటన్ యార్డులో 114, 115, 116 పోలింగ్ కేంద్రాలకు కలిపి ఒకే టెంట్ ఏర్పాటు చేయడంతో అవస్థలు ఎదుర్కొన్నారు.



సేదతీరుతున్న మహిళలు







ఓటు కోసం వృద్ధుల పాట్లు

అసెంబ్లీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశామని అధికారులు పేర్కొన్నా.. జిల్లా కేంద్రంలోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల్లేక వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బంది పడ్డారు. నడవలేని స్థితిలో ఉన్నా.. కర్ర సాయంతో బూత్ వరకు వచ్చి ఓటు వేశారు. కేంద్రాల వద్ద సహాయకులు లేకపోవడంతో వారి కుటుంబ సభ్యులే వీల్‌చైర్‌లో కూర్చొబెట్టుకొని పోలీసుల సహాయంతో ఓటు వేయించారు. కేంద్రాల వద్ద సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో అధికారుల తీరుపై ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



వలంటీర్ల సేవలు

ఖానాపూర్ మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బంది పడకుండా స్థానిక వలంటీర్లు, సిబ్బంది, నాయకులు వారిని వీల్‌చైర్లలో తరలించి సేవలు అందించారు. బూత్‌లోకి వెళ్లి ఓటు వేసిన అనంతరం వారిని మళ్లీ బయట వారి కుటుంబసభ్యుల వద్ద వదిలిపెట్టారు. –ఖానాపూర్



ఆలస్యం.. ఓటు దూరం



పోలీసులతో వాదిస్తున్న యువకుడు

ఖానాపూర్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌కు గురువారం సాయంత్రం ఓ యువకుడు 5:02 గంటలకు ఓటు వేసేందుకు వచ్చాడు. అయితే అప్పటికే కేంద్రంలోపల 100 మంది ఓటే వేసేందుకు బారులు తీరారు. 5 గంటల వరకు కేంద్రంలోనికి వచ్చిన వారికి అనుమతించిన ఎంపీడీవో మల్లేశ్, ఆలస్యంగా వచ్చిన యువకుడిని ఓటే వేసేందుకు అనుమతి ఇవ్వలేదు. దీంతో నిరాశగా వెనుదిరిగాడు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో గేదె మృతి



గేదె కళేబరం చూపుతున్న బాధితుడు

సారంగపూర్: మండలంలోని మలక్‌చింతోలి గ్రామంలో దాసరి జగదీశ్ అనే రైతుకు చెందిన గేదె గురువారం విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. బాధితుడి కథనం ప్రకారం.. ఉదయం మేత కోసం బయటకు వెళ్లిన గేదె ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.50వేల వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు. అధికారులకు సమాచారం ఇవ్వడంతో సరఫరా నిలిపేసి వచ్చి గేదెను బయటికి తీశారు.

ఆధ్యాత్మికత వైపు పయనించాలి



పూజలు నిర్వహిస్తున్న వెంకటేశ్ శర్మ

కుంటాల: సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత వైపు పయనించాలని ఆగమ ప్రతిష్ట జ్యోతిష్యశాస్త్ర, బ్రహ్మశ్రీ వెంకటేశ్‌శర్మ పేర్కొన్నారు. గురువారం రాత్రి కుంటాలలో కదార్ల హరిప్రసాద్‌నారికేళ గురు స్వామి నిర్వహించిన మహా పడిపూజలో పాల్గొని మాట్లాడారు. ప్రజలు చెడు వ్యసనాలకు దూరం ఉండి.. సమాజ సేవలో పాల్గొంటేనే మానవజన్మ సార్థకమవుతుందని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గణపతి, సుబ్రహ్మణ్యం, అయ్యప్ప స్వామి చిత్ర పటాలను పంచామృతాలతో అభిషేకించారు. కార్యక్రమంలో గురుస్వాములు నర్సారెడ్డి ,శనిగారపు చిన్నయ్య, జక్కని గజేందర్, రాజేశ్వర్, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాబా ఆలయంలో పూజలు

కుంటాల: మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. వివిధ గ్రామాల మహిళలు సాయినామస్మరణ చేస్తూ ఆలయానికి పాదయాత్రగా చేరుకున్నారు. సాయంత్రం గ్రామంలో సాయిబాబా పల్లకిని ఊరేగించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

మద్యం పట్టివేత

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడ గ్రామంలో గురువారం ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి జీటీ.కవిరాజ్ తన సిబ్బందితో రెడ్డి మల్ల శ్రీనివాస్ గౌడ్ హోటల్‌లో సోదా చేయగా రూ.1170 విలువైన మద్యం సీసాలు లభ్యమయ్యాయి. ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి జీటీ.కవిరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ పేర్కొన్నారు.

ఓటేసిన కోరుట్ల స్వతంత్ర అభ్యర్థి

కడెం: కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే (స్వతంత్ర)అభ్యర్థి ముత్యం రఘు మండలంలోని కొండుకూర్ గ్రామంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవడంతోపాటు యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు.

గ్రామస్తులు, పోలీసులకు గొడవ

కడెం: ఎన్నికల వేళ తమ పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు సరికాదని మండలంలోని కొత్త మద్దిపడగ, పాత మద్దిపడగ గ్రామస్తులు పేర్కొన్నారు. ఓటేసేందుకు వచ్చిన తమను ఎస్సై రాజు అకారణంగా కొట్టారని పాత మద్దిపడగ వాసులు పేర్కొనగా.. తమ ఇళ్ల ముందు ఉంటే వెళ్లాలని పోలీసులు కొట్టారని కొత్త మద్దిపడగ వాసులు ఆరోపించారు.

ఎన్నికల సిబ్బందిపై గ్రామస్తుల ఆగ్రహం



కేంద్రంలో గొడవకు దిగిన నాయకులు

లోకేశ్వరం: మండలంలోని పొట్‌పల్లిలో 187వ పోలింగ్ కేంద్రంలో ఎన్నికల సిబ్బందిపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం ఐదు గంటలకు కేంద్రం ఆవరణలో ఉన్నవారికి టోకెన్ ఇచ్చారు. ఆ సమయంలో కేంద్రంలో బీఆర్‌ఎస్ ఏజెంట్ ఓటర్లకు ఇంక్ పూయగా కాంగ్రెస్, బీజేపీ పార్టీల ఏజెంట్లు అభ్యంతరం తెలిపారు. మరోవైపు ఏజెంట్లు లేకుండా పీవో ఈవీఎంను సీల్ వేయడంపై గొడవకు దిగారు. ఎస్సై సాయికుమార్, సెక్టోరియల్ అధికారి రఘువంశీ వెంటనే కేంద్రానికి వచ్చి ఈవీఎం సీల్ తొలగించి నమోదైన ఓట్లను లెక్కించారు. పోలైన ఓట్లతో సరిపోలడంతో శాంతించారు. అనంతరం పీవో పార్టీల ఏజెంట్లకు క్షమాపణలు చెప్పి ఈవీఎంను ముధోల్ తీసుకెళ్లడంతో గొడవ సద్దుమణిగింది.